# 9. రుబాయీలు

**చదవండి - ఆలోచించండి - చెప్పండి**

– డా॥ సామల సదాశివ

జీవితమే ఒక నాటకం
నీ పాత్ర ధరించు
జీవితమే ఒక బహుమానం
దాన్ని స్వీకరించు
జీవితం గొప్ప రహస్యం;
పరిశోధించు
జీవితం ఒక సవాలు;
దాన్ని ఎదుర్కో!

**ప్రశ్నలు**

1. ఈ మాటలు ఏ విషయాన్ని గురించి తెలుపుతున్నాయి?
2. జీవితం ఎలాంటిది? దాన్ని ఎలా స్వీకరించాలి?
3. జీవితాన్ని ఎందుకు పరిశోధించాలి?
4. జీవితాన్ని ఎలా ఎదుర్కోవాలి?

**ఉద్దేశం**

తరాలు మారినా మానవీయపు విలువలు, మన జీవనమూల్యాలు మారవు. వాటిని పరిచయం చేయడమే ఈ పాఠం ఉద్దేశం.

అమ్జద్ హైదరాబాదీగా పిలువబడే అమ్జద్ హుస్సేన్ సూఫీతత్త్వవేత్త, గొప్పకవి. వీరి రుబాయీలను సదాశివగారు అనువాదం చేశారు. ఆ అనువాద రుబాయీలే ప్రస్తుత పాఠం.

**విద్యార్థులకు సూచనలు**

1. పాఠం చదవండి. తెలియని పదాలకు అర్థాలను తెలుసుకోండి.
2. చిత్రాలను చూసి, సందర్భాన్ని అనుసరించి, ఆలోచించి భావాన్ని గ్రహించండి.
3. పాఠంలో తెలియని విషయాలు గాని, తెలుసుకోవలసిన అంశాలు గాని మీ ఉపాధ్యాయుడితో చర్చించండి, తెలుసుకోండి.

© SCERT not to be republished



నిన్ను నీవు గుర్తింప లేకున్న యెడల
ఇంతవఱకు సాధించిన దంత వృథయె
పుడమి యంతయు నీకు లోఁబడిన నేమి
నిన్ను నీవు లోఁబరచు కోకున్న వృథయె 1

వెలితి వానికి ధనము లభించె నేని
బుద్బుదంబు విధాన నుప్పొంగుచుండు
అల్పవిషయాన గర్వింతు రథములెన్న
గాలిలోఁ జిఱు పరకయుఁ దేలిపోవు 2

అందఱకు ముదం బొనరింపు మదియె పర్వ
మంతయును మంచిదని యెంచు మదియె స్తవము
ఎల్ల జంతువు లీశ్వర సృష్టి యగుటఁ
దలఁచి వర్తింపు మదియె యద్వైత మనఁగ 3

ఫలము వలతేని విత్తన మలికి చూడు
పడయఁ దలఁచిన సర్వంబు విడిచి చూడు
మొక్కసారి స్వార్థము వీడి యొరుల వాఁడ
వై సమములేని యానంద మంది చూడు 4

కణము కణమున సంద్రంబు కడలుకొనును
అణువు నణువున మణిదీప్తు లలముకొనును
దృష్టిగలిగిన మంచి దర్శింపవచ్చు
అదియె లేకున్న రత్నము నశ్మ సమము. 5

మబ్బు విడిపోవఁగాఁ జందమామ వెడలె
శుక్తి పగులఁగ వెడలెను మౌక్తికంబు
దాఁచి పెట్టువాఁ డవనిలో దాఁగు కొనియె
దాఁచఁబడిన ధనంబదీతలకు వెడలె 6



© SCERT
to be republished

### కవి పరిచయం



డా॥ సామల సదాశివ ఆదిలాబాద్ జిల్లా దహగామ్ మండలం తెనుగు పల్లెలో 11 మే 1928న జన్మించారు. సంస్కృతం, హిందీ, ఆంగ్లము, ఉర్దూ, ఫార్సీ, మరాఠీ భాషల్లో వీరు పండితులు. చాలామంది ఉర్దూ, ఫార్సీ, హిందీ, మరాఠీ కవుల, రచయితల సాహిత్యాన్ని వీరు తెలుగులోకి అనువాదంచేశారు.

ఉర్దూ సాహిత్య చరిత్ర, అమ్జద్ రుబాయీలు, మలయమారుతాలు, యాది, సంగీత శిఖరాలు మొదలైనవి వీరి ప్రఖ్యాత రచనలు. 'అమ్జద్ రుబాయిలు' అనువాదానికి 1964లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే ఉత్తమ అనువాదరచనా పురస్కారం, 'స్వరలయలు' గ్రంథానికి 2011లో కేంద్ర సాహిత్యఅకాడమీ అవార్డు లభించాయి. సదాశివగారిని హిందుస్థానీ- కర్ణాటక సంగీతానికి సాంస్కృతికవారథిగా విమర్శకులు గుర్తించారు. వీరి రచనల్లో భాష సహజసుందరంగా, సరళంగా ముచ్చట్ల రూపంలో మనసుకు హత్తుకుపోయేట్లు ఉంటుంది. వీరు ఆగష్టు 2012లో మరణించారు.

#### ప్రక్రియ - రుబాయీ

ఫార్సీ, ఉర్దూ సాహిత్యాల్లో 'రుబాయీ' అనేది ప్రసిద్ధిపొందిన ఛందోరూపం. రుబాయీ అనే అరబ్బీ మాట 'రుబ్' నుండి పుట్టింది. రుబ్ అంటే రసం, సారం అని అర్థాలు. రుబాయీ అంటే రసవంతమైంది అని అర్థం. రుబాయీలో నాలుగుపాదాలుంటాయి. ప్రతిపాదం ఒక సంపూర్ణవాక్యం. ఒకటి, రెండు నాలుగు పాదాలకు అంత్యప్రాస నియతి ఉంటుంది. మూడోపాదంలో ఉండదు. మూడోపాదం - ఒకటి, రెండు పాదాలను అనుసంధానం చేస్తుంది. మొత్తంగా మూడుపాదాల్లోని అభిప్రాయాన్ని బలపరుస్తూ నాలుగోపాదం చరుపుతో మెరుస్తుంది. గజల్, రుబాయీల్లో అంత్యప్రాసకు పూర్వపదం కూడా ప్రాసబద్ధంగా కనిపిస్తుంది. ఈ రెండింటిని 'రదీఫ్ కాఫియా' అంటారు. రుబాయీ ఒకే ఛందస్సులో, ఒకే విషయవిభాగంగా నడుస్తుంది.

© SCERT not to be republished

### భావాలు

1. నీ గురించి నీవు తెలుసుకోలేకపోతే ఇంతవరకు నీవు సాధించినదంతా వ్యర్థమే. నీ మనస్సు అదుపులో లేకుంటే ఎంత సాధించినా ఉపయోగంలేదు.
2. అల్పునికి సంపద లభిస్తే నీటిబుడగలా ఉప్పొంగిపోతాడు. గడ్డిపరక గాలిలో తేలిపోయినట్లుగా అధములు చిన్న విషయాలకే గర్వపడతారు.
3. అందరికీ ఆనందాన్ని కలిగించడమే పండుగ. అంతా మంచిదని భావించడమే ప్రశంసనీయం. సకల ప్రాణులూ దైవసృష్టి అని భావించి నడుచుకోవడమే అద్వైతం. అంటే అన్ని జీవులపట్ల సమదృష్టి ఉండాలి.
4. పంట కావాలంటే విత్తనం నాటాలి. అనుకున్నది సాధించాలంటే త్యాగాన్ని ప్రదర్శించాలి. స్వార్థం విడిచిపెట్టి అందరి మేలుకోసం పనిచేసినప్పుడు నిజమైన ఆనందాన్ని పొందుతావు.

5. నీవు చూడగలిగితే ఒక నీటిబిందువులో సముద్రాన్ని చూడవచ్చు. అణువణువులో అనేక కాంతులు దర్శింపవచ్చు. ఆ దృష్టి లేకపోతే రత్నంకూడా రాయిలా కనిపిస్తుంది.

6. మబ్బులు తొలగిపోతే చంద్రుడు కనిపిస్తాడు. ముత్యపు చిప్ప విచ్చుకుంటే ముత్యం బయటకు వస్తుంది. ఎంత సంపదను దాచిపెట్టినవాడైనా మట్టిలో కలిసిపోతాడు. దాచిపెట్టిన ధనమంతా ఇతరుల పాలవుతుంది.

## ఇవి చేయండి

## I అవగాహన - ప్రతిస్పందన

### అ) కింది అంశాల ఆధారంగా మాట్లాడండి.

1 'తనను తాను తెలుసుకోవడం' అంటే ఏమిటి?

2 మనిషికి స్వార్థం ఎందుకుండగూడదో చర్చించండి.

### ఆ) కింది పదాలు చదివి పాఠం నుంచి వాటికి సంబంధించిన పద్యపాదాలను, భావాలను రాయండి.

1. ధనం-బుద్బుదం, 2. స్వార్థం-ఆనందం, 3. పుడమి-నిన్ను నీవు

### ఇ) కింది పద్యాన్ని చదివి భావంలో ఇచ్చిన ఖాళీలను పూరించండి.

సమయమమూల్య మొక్క నిమిషంబు వృథా చన గ్రమ్మఱింప నే
రము; మన యాయువా త్రుటి పరంపర యౌట నెఱింగి నిద్రమాం
ద్యమును దొలంగి మీ పనుల నారయుడో జనులార యంచు దం
బముగ యెడన్నిగిడ్చి కృకవాకము గూసెడి నింటి కొప్పునన్.

భావం :

సమయం చాలా ............ ఒక్క నిమిషం వృథాగా గడిపినా ............ ఇది తెలుసుకొని, నిద్ర మత్తు వదలండి. మీ పనులకు వెళ్లండి అన్నట్లుగా .............. మెడను నిగిడ్చి ........... మీద కూసింది.

### ఈ) కింది వాక్యాలు చదవండి. రెండు ప్రశ్నలు రాయండి.

నిన్ను నీవు గుర్తింపు లేకున్న యెడల
ఇంతవఱకు సాధించిన దంత వృథయె
పుడమియంతయు నీకు లోఁబడిన నేమి
నిన్ను నీవు లోఁబరచుకోకున్న వృథయె

### ఉ) పాఠం ఆధారంగా కిందిపట్టికను పూరించండి

| | | |
|---|---|---|
| 1. | మన గురించి మనం తెలుసుకోవడం | |
| 2. | నీటి బుడగలా ఉప్పొంగిపోవడం | |
| 3. | అందరికీ ఆనందం కలిగించడం | |
| 4. | ప్రశంసనీయం | |
| 5. | మబ్బులు తొలగితే | |
| 6. | ముత్యం బయటకు వస్తుంది. | |

### ఊ) కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

1. నిన్ను నీవు గుర్తించకపోతే ఏమవుతుంది?
2. అల్పునికి ధనం లభిస్తే ఎలా ప్రవర్తిస్తాడు?
3. 'అద్వైతం' స్థితి ఎలా కలుగుతుందని చెప్పాడు?
4. 'ధనము అశాశ్వత'మని చెప్పడానికి కవి ఎలాంటి ఉదాహరణలు ఇచ్చాడు?
5. ఎదుటివారిలో మంచిని ఎప్పుడు దర్శించవచ్చు?

## II. వ్యక్తీకరణ- సృజనాత్మకత

### అ) కిందివాటికి మీ సొంతమాటల్లో ఐదు వాక్యాల్లో సమాధానాలు రాయండి.

1. మనసును అదుపులో పెట్టుకోవడంవల్ల కలిగే లాభమేమిటి?
2. అల్పుని స్వభావాన్ని గురించి రాయండి.
3. "అనుకున్నది సాధించాలంటే త్యాగం చేయాలి" దీనితో మీరు ఏకీభవిస్తారా! ఎందుకు?
4. 'ఇతరుల మేలుకోసం పనిచేస్తే నిజమైన ఆనందం కలుగుతుంది'. దీనిద్వారా మీరేమి గ్రహించారు?

### ఆ) కిందివాటికి పదిహేను వాక్యాల్లో సమాధానాలు రాయండి.

1. ఈ పాఠం ఆధారంగా సామల సదాశివ గారి గురించి వ్యాసం రాయండి.
2. "సందర్భాన్నిబట్టి స్పందించాలి" దీన్ని ఉదాహరణలతో వివరించండి.
3. ఈ పాఠ్యాంశంద్వారా కవి అందించిన సందేశం ఏమిటి?

### ఇ) సృజనాత్మకంగా రాయండి.

'తరుగుతున్న మానవత్వపు విలువలు' అనే అంశంపై ప్రసంగించడానికి ఒక ప్రముఖ సామాజికవేత్త మీ పాఠశాలకు వస్తున్నాడు. అతడు ప్రసంగ వ్యాసం రాసుకున్నాడు. ఆ ప్రసంగవ్యాసం ఎలా ఉంటుందో ఊహించి రాయండి.

లేదా

పాఠ్యాంశం ఆధారంగా కొన్ని సూక్తులను తయారుచేయండి.

©SCERT not to be republished

ఈ) ప్రశంసాత్మకంగా రాయండి.

రుబాయిలలో భావ సౌందర్యాన్ని ప్రశంసిస్తూ ఆరు వాక్యాలను రాయండి.

## III. భాషాంశాలు

### పదజాలం

అ) కింది వాక్యాలలో గీత గీసిన పదాలకు పాఠంలో సమానమైన అర్థాన్నిచ్చే పాదాలు ఏవి రాయండి.

1. తామరాకుపై నీటిబొట్టు ముత్యం లాగా ఉంటుంది = ..............................................
2. జీవితాలు నీటిబుడగ లాంటివి. = ......................................................................

ఆ) కింద గీత గీసిన పదాలకు నానార్థాలు రాసి, వాటిని వాక్యాల్లో ప్రయోగించండి.

1 శ్రమకు తగిన ఫలం కనిపించాలి.

2 స్వార్థం లేని నరుడు దైవంతో సమానం.

ఇ) కింద గీత గీసిన పదాలకు వికృతులు రాసి, వాక్యాల్లో ప్రయోగించండి.

1 వేల అలజడులున్నా సముద్రం పైకి గంభీరంగానే ఉంటుంది.

2 పృథ్వపై నిస్స్వార్థపరులను వేళ్లమీద లెక్కపెట్టవచ్చు.

### వ్యాకరణం

అ) కింది సంధులకు ఈ పాఠంలో ఉదాహరణలు వెతికి రాసి, సూత్రాలు రాయండి.

1. ఇత్వసంధి 2. అత్వసంధి 3. ఉత్వసంధి 4.లు,ల,నల సంధి 5. సవర్ణదీర్ఘసంధి

ఆ) కింది సమాసాలకు ఈ పాఠంలో ఉదాహరణలు వెతికి రాసి, సూత్రాలు రాయండి.

1.విశేషణ పూర్వపద కర్మధారయం, 2. షష్ఠీ తత్పురుషం,

3. నఞ్ తత్పురుషం, 4. తృతీయా తత్పురుషం.

### ప్రాజెక్టు పని

ఉర్దూనుంచి తెలుగులోకి అనువాదంచేసిన గ్రంథాలను, రచయితలను, వివిధ ప్రక్రియలను గురించి తెలుసుకోండి. పట్టికను తయారుచేయండి.

పేదలకు ఉపకారం చేస్తా ననడం గర్వం. వారిలోని
భగవంతునికి సేవ చేస్తా' ననడం మానవత్వం.
- రామకృష్ణ పరమహంస.

© SCERT not to be republished